# తెలుగు భాషా సాహిత్యాలు - క్రైస్తవుల పాత్ర

మానవుడు తనలోని భావాల్ని, ఆలోచనల్ని, తలంపుల్ని బయటకు వ్యక్తీకరించే సాధనమే భాష. భాష వాగ్రూపం, లిఖితరూపమని రెండు రకాలుగా ఉంటుంది. ఆదియందు దేవుడు వాగ్రూప భాష ద్వారా సృష్టిని ఉనికిలోనికి తెచ్చి, తద్వారా తనునుతాను ప్రత్యక్ష పరచుకొన్నాడు. దీన్నే సాధారణ ప్రత్యక్షత అని కూడ అంటారు. అనంతర కాలములో లిఖితరూప భాష ద్వారా అంటే బైబిలు ద్వారా తనను తాను ప్రత్యక్షపరచుకొంటున్నాడు. దీన్నే ప్రత్యేక ప్రత్యక్షత అని అంటారు. భాష దైవ ప్రసాదితం. తన వాక్కుతో విశ్వాన్ని ఉనికిలోకి తెచ్చిన దేవుడే మనిషికి వాక్కునుగ్రహించాడు. ఏదేను తోటలో ఆదాము హవ్వలతో దేవుడు సంభాషించినట్లు బైబిల్లో చూస్తాం. అంతేకాదు ఆదాము తన ప్రక్కటెముకలో నుండి తీయబడిన హవ్వనుచూసి తనలోని ప్రేమోద్వేగాన్ని పాటరూపంలో వ్యక్తీకరించినట్లుకూడ చూస్తాం. భాష ఇహపరలోకాల్లోను కొనసాగుతుంది. ప్రకటన గ్రంథం 7 వ అధ్యాయంలో చెప్పబడిన "...ప్రతి జనములో నుండియు, పతి వంశములో నుండియు, ప్రజలలలో నుండియు, ఆయా భాషలు మాట్లాడు వారిలో నుండియు వచ్చి ఎవడునూ లెక్కింపజాలని ఒక జనసమూహము కనబడెను" అనే వచనమే ఇందుకు నిదర్శనం.

ఇక తెలుగు క్రైస్తవ భాషా సాహిత్యాల్ని పరిశీలిద్దాం. బయట ప్రపంచానికి అంతగా తెలియకపోవచ్చుగాని, తెలుగు సాహిత్యంలో క్రైస్తవసాహిత్యానికి ప్రత్యేక స్థానముంది. తెలుగు క్రైస్తవ సాహిత్యాన్ని అనువాద సాహిత్యం, స్వతంత్ర సాహిత్యమని రెండు రకాలగా విభజించవచ్చు. తెలుగు బైబిలు అనువాదం, తెలుగు కీర్తనలు, వివిధరరకాల క్రైస్తవ సాహిత్య ప్రక్రియలు అన్నీ తెలుగు భాషా సాహిత్యాభివృద్ధిలో భాగమే. ఈనాడు సుమారు 3 మిలియన్ల తెలుగు ప్రజలు నిత్యం తెలుగు బైబిలును చదువుతారు. ఎన్నో తెలుగు పాటల్ని అనుదిన ప్రార్థనల్లో పాడుకొంటారు. ఎంతోమంది భక్తుల జీవిత చరిత్రలు, ఎంతో క్రైసవ వేదాంత సాహిత్యం తెలుగు భాషలోకి అనువదించబడింది. ఎన్నో స్వతంత్ర రచనలు వచ్చాయి. ఇవన్నీ క్రైస్తవుల ఆధ్యాత్మిక జీవితాలకి తోడ్పడటమే కాదుగాని, తెలుగు భాషా సాహిత్యాల్లో భాగమయ్యాయి. అనువాద యుగంగా పిలువబడుతున్న ఆధునిక యుగంలో క్రైస్తవ సాహిత్యానువాదాలు ద్విగుణీకృతమయ్యాయి.

తెలుగు బైబిలు అనువాదాన్ని మనకందుబాటులోకి తేవడానికి కృషిచేసిన బెంజమిం షూల్జ్, ఫిలిప్ ఫేబ్రియస్, విలియంకేరీ, సి. పి. బ్రౌన్, ఇలా ఎందరో మిషనరీలు తెలుగులో వివిధరకాల వ్యాకరణాలు, పదకోశాల్ని(dictionaries) తయారు చేసి, తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని కృషి చేశారు. వారు క్రైస్తవ్య వ్యాప్తిలో భాషాభివృద్ధిని ఎప్పుడూ విస్మరించ లేదు.

స్వదేశీ పండితుడైన ఆనందరాయరనే కవి తెలుగులో బైబిల్ను పద్యకావ్యంగా అనువదించాడు. లక్కవరం జమీందారయిన రాజా మంత్రిప్రగడ భుజంగరావు క్రొత్త నిబంధనని నవనిబంధన అనే పేరుతో కావ్యరూపంలో అనువదించి ప్రచురించాడు. దీనితో పాటు నీతివాక్యరత్నావళి, క్రీస్తుమతసారం, సత్క్రైస్తవ శతకం, ప్రార్థనా విధానం ఇత్యాది రచనల్ని చేశాడు. పింగళి ఎల్లనార్యుని సర్వేశ్వర మహత్మ్యం, మంగళగిరి ఆనందకవి రచించిన వేదాంతరసాయనం క్రైస్తవ సాహిత్యంలో పేర్కోదగ్గ కావ్యాలు. మల్లెల తిమ్మరాజు జ్ఞాన చింతామణి అనే కావ్యాన్ని వ్రాశాడు. పురుషోత్తం చౌదరి, పులిపాక జగన్నాథంలు వరుసగా క్రైస్తవనీతి ప్రకాశిక, నీతి బోధిని అనే కావ్యాల్ని రాసి ప్రచురించారు. నవయుగ కవిచక్రవర్తి, కళా ప్రపూర్ణ ఇత్యాది బిరుదాంకితుడైన ప్రముఖ కవి గుర్రం జాషువా రచించిన క్రీస్తు చరిత్ర కేంద్ర సాహిత్య బహుమానం పొందిన గ్రంథం. కవిశేఖర కంతేటి చిన్నజాన్ యేసుక్రీస్తు చరిత్ర అనే పద్యకావ్యాన్ని రాశాడు. ఈ కవుల రచనలన్నిటిలో తెలుగు సంస్కృతి, దేశీయత ఉట్టిపడుతుంది.

ఇకపోతే క్రైస్తవ కీర్తనాకారుల్లో పేర్కోదగ్గవారు పురుషోత్తం చౌదరి, పులిపాకజగన్నాథం, పిడపర్తి ఎజ్రా, ముంగమూరి దేవదాస్, మురారి దావీదు, మల్లెల దావీదు, బొంతా సమూయేలు, చార్లెస్ కిన్సింగర్ మొదలగువారు 150 మందికి పైగా ఉన్నారు. వీరంతా రాగ తాళ శృతి లయ సహితంగా తమ రచనల్ని సాగించారు. ఈ తరంలో వచ్చిన జాన్ బిల్మోరియా, ఎజ్రా శాస్త్రి, దేవరాజుగారి కీర్తనలు, సీయోను కీర్తనలు ఇలా వేలకొలది ఉన్నాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. ఇవే కాకుండా ఎన్నో అనువాద కీర్తనలు కూడ తెలుగులో ఉన్నాయి. దీన్ని బట్టి క్రైసవ రచయితలు అనువాదంలో కూడ సిద్ధహస్తులని తెలుస్తుంది. ఈ కీర్తనలన్నీ తెలుగు కీర్తనాకారుల భాషా సాహిత్యాల తోడ్పాటుకు నిలువెత్తు నిదర్శనాలు.

ఒక్క కీర్తనలే కాక క్రైస్తవ్యం ఇతివృత్తంగా కలిగిన నవలలు, నాటికలు, నాటకాలు, ఏకాంకికలు, బుర్రకథలు, హరికథలు ఎన్నో తెలుగు సాహిత్యంలో చోటుచేసుకొన్నాయి. వీటిని తెలుగునాట గ్రామాల్లో ప్రదర్శిస్తుండటం చూస్తాం. క్రైస్తవ నాటక సాహిత్యంలో కృషిచేసిన వారిలో పేర్కోదగ్గవారు కూచిపూడి రాజరత్నం, జాన్‌అత్తోట, గేరా ప్రేమయ్య, బీర్నీడి ప్రసన్న, గుర్రం జాషువా, నూతక్కి అబ్రహాం, పాటిబండ్ల ఆనందరావు మొదలగువారు సుమారు 30 మంది ఉన్నారు. వీరి నాటకాల్లో ఎక్కువ ప్రాచుర్యం వహించినవి క్రీస్తుపుట్టుక, సంసోను దెలీలా, సిల్వధారి, మార్టిన్ లూథర్ , పరివర్తన ఇలా ఎన్నో ఉ న్నాయి.

ఇవన్నీ మన ముందు తరాలవారు మనకందించిన సాహిత్య వారసత్వసంపద. ఇది నేటి మన బాధ్యతను కూడా గుర్తుచేస్తుంది. సుసంపన్నమైన మన తెలుగు భాషా సంస్కృతుల్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత

మనందరిది. ముఖ్యంగా ప్రవాసాంధ్ర క్రైస్తవులంగా మనమనుభవిస్తున్న ఈ క్రైస్తవ సాహిత్య సంపదని భావితరాలకు కూడా అందించాల్సిన అవసరత ఎంతైనా ఉంది. భాషనేది కులమత వర్ణ వర్గ ప్రాంతీయ బేధాలకతీతమైంది. అది ఏఒక్కరి సొత్తూ కాదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదేశాల్లో తెలుగు క్రైస్తవ సంఘాలు, సహవాసాలు ఉన్నాయి. వీటి ప్రధాన ఉద్దేశం మాతృభాషలో దేవుని ఆరాధించడం. ఈనాడు క్రమంగా తెలుగు సహవాసాల్లో తెలుగు భాష మరుగవటం గమనించవలసిన విషయం. కాబట్టి తెలుగు సహవాసాల కొనసాగింపుకు కొన్ని చర్యలు తీసుకోవలసిన అవసరత ఉంది. మొదటిగా సహవాసాల్లో ప్రార్థనాకార్యక్రమాల్ని, పిల్లల బైబిలు తరగతుల్ని తెలుగు భాషలో కొనసాగనివ్వాలి.

రెండవది బైబిలు పాఠాల్ని, పాటల్ని పిల్లలకు తెలుగులో నేర్పించడానికి అనువుగా మొదట ప్రాధమిక తెలుగు భాషా బోధనని ప్రవేశపెట్టవచ్చు. తల్లిదండ్రులు పిల్లలతో మాతృభాషలో సంభాషించడం విధిగా చేపట్టవలసిన విషయం. తెలుగులో ఆయా రచనల్ని చేస్తూ, ప్రోత్సహించడం ద్వారా, పిల్లలకు నేర్పించి, ప్రదర్శనలివ్వడం ద్వారా మన భావితరాలకు తెలుగు క్రైస్తవ సాహితీ వారసత్వాన్ని అందించవచ్చు, మాతృభాషను పదికాలాల పాటు పరిరక్షించుకోవచ్చు. పెద్దలు, పాఠకులు ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తారని, అందుకు తగిన కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

- డా. హెప్సీబ సుంకరి
తెలుగు అధ్యాపకురాలు, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీ,
కాలిఫోర్నియా

**ఉపయుక్త గ్రంథాలు:**

హెప్సీబ సుంకరి – తెలుగు బైబిలు అనువాదాలు – ఒక పరిశీలన, 2001
కృపాచారి గుజ్జర్లమూడి – తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ, 1988